సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 26 । జూలై । 2024



పారిశుద్ధ్యం.. ప్రత్యేక డ్రైవ్
నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. IIలో



విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
రాత్రివేళ రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యాన పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. IIలో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం
జిల్లాలో గురువారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

సత్వరమే పెదవాగు ఆనకట్ట మరమ్మతులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో ఇటీవల గండి పడిన పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట మరమ్మతు పనులు సత్వరమే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇటీవల వరదలతో ప్రాజెక్ట్ ఆనకట్టకు గండ్లు పడిన విషయం విదితమే. దీంతో ప్రాజెక్ట్ తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని తుమ్మల కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈమేరకు ఈ వానాకాలం సీజన్‌లోనే పంటలకు సాగునీరు అందేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులు రూ.3.50 కోట్లతో అంచనాలు సమర్పించారు. ఈనేపథ్యాన మరమ్మతులపై సత్వరమే స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు..

బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వైఫై సేవలు ప్రారంభం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డీజీఎం, ఉద్యోగులు

మధిర: మధిరలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వైఫై సేవలు ప్రారంభించినట్లు ఖమ్మం డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.నివాసరావు తెలిపారు. పట్టణంలోని కార్యాలయం వద్ద ఆయన గురువారం మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కనెక్షన్ తీసుకున్న వారికి రూ.3 వేల విలువైన మోడెం ఉచితంగా అందచేస్తామని చెప్పారు. నెలకు రూ.399తో మొదలయ్యే ప్లాన్లతో వైర్‌లెస్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకున్న వారికి హైస్పీడ్ డేటాతో పాటు 250 టీవీ చానళ్లు, ల్యాండ్ లైన్‌ఫోన్ సౌకర్యం వస్తుందని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లాలో 436 టవర్ల ద్వారా వచ్చేనెల 15 నుంచి 4జీ సేవలు మొదలవుతాయని, ఇతర నెట్‌వర్క్‌లు పనిచేయని మారుమూల ప్రాంతాల్లోనూ బీఎస్ఎన్ఎల్ సేవలందేలా 47 టవర్లు ఏర్పాటుచేస్తున్నట్లు డీజీఎం చెప్పారు. అలాగే, రూ.147కే నెలకు అపరిమితమైన కాల్స్ 20 జీబీ డేటాతో అందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం ఏజీఎం కె.రాంకుమార్, సబ్ డివిజనల్ ఇంజనీర్ జి.ప్రసాద్‌రావు, ఉద్యోగులు శ్రీకాంత్, ధనేకుల అన్వేష్, ఆదిత్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ప్రవేశాలకు అనుమతి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ ఏడాది మొదటి సంవత్సర విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు అనుమతి లభించింది. ఈమేరకు కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్స్ యూనివర్సిటీ 100 సీట్ల భర్తీకి అనుమతి జారీ చేసింది. ఇటీవల నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు కాలేజీని సందర్శించగా.. ఇక్కడి వసతులు, బోధనా ఏర్పాట్లపై సంతృప్తి చెందడంతో ఈ ఏడాది సైతం ప్రవేశాలకు అనుమతించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం సమకూర్చాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీడీ విజయలక్ష్మి

కొణిజర్ల: ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం సమకూర్చేలా వంట సిబ్బంది తర్ఫీదు పొందాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి సూచించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల వంట సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులకు నాణ్యమైన రుచికరమైన వంటల తయారీపై కొణిజర్లలో ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి రత్నాకర్, ఏటీడీఓలు సత్యవతి, జహీరుద్దీన్, ఎంపీఓలు రాజేశ్వరి, సాంబశివరెడ్డి, హెచ్ఎం సోమ్లా, వార్డెన్లు సునీత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు జేఎల్ఎంల పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలకు చెందిన జూనియర్ లైన్‌మెన్ల ఎంపికకు ఈనెల 27న శనివారం ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఎ.సురేందర్ తెలిపారు. ఎన్పీడీసీఎల్ విడుదల చేసిన 9వ జాబితాలోని అభ్యర్థులకు ఈ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తామని, ఇప్పటికే పోస్ట్ ద్వారా సమాచారం అందుకున్న అభ్యర్థులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

సాగునీటి రంగానికి జై



డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. నీటిపారుదల, అటవీ, రోడ్లు, పంచాయతీరాజ్ శాఖల్లో పెండింగ్ పనులకు నిధులు కేటాయించారు. తద్వారా జిల్లాలోని సీతారామ, వైరా, లంకాసాగర్ ప్రాజెక్టుల పనులు ఊపందుకోనున్నాయి. అలాగే, ఎర్రుపాలెం మండలంలో ప్రత్యేకంగా ఎత్తిపోతలకు నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. ఇక దెబ్బతిన్న తారురోడ్లతోపాటు నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో అంతర్గత రోడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణం జరగనుంది. అంతేకాక ఎకో టూరిజం కింద కనకగిరి గుట్టలను అభివృద్ధి చేయనున్నట్లు ప్రస్తావించారు. ఇంకా పలు సంక్షేమ పథకాలకు నిధులు కేటాయిస్తామని వెల్లడించిన నేపథ్యాన జిల్లాలో అర్హులైన వారు లబ్ధి పొందనున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

ప్రాజెక్టుల వారీగా కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	2022-23	2023-24	2024-25
సీతారామ	721.95	1,039.60	687.81
ఎర్రుపాలెం	-	-	500.00
లంకాసాగర్	-	13.69	5.00
వైరా ప్రాజెక్టు	-	99లక్షలు	14.49
భక్తరామదాసు	0.50	-	50.15 లక్షలు

సీతారామ, వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులకు నిధులు

- ఎర్రుపాలెం మండలంలో ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్
- ఎకో టూరిజంలో కనకగిరి గుట్టల ఎంపిక
- రోడ్ల నిర్మాణం, తండాల్లో జీపీ భవనాలకు నిధులు
- 'భట్టి' బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక స్థానం

వ్యవసాయంపైనే దృష్టి
వ్యవసాయానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలుతో పాటు సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడమే కాక రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకరానున్నట్లు ప్రకటించారు. అలాగే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తామని వెల్లడించడంతో ఇప్పటికే అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు లాభం జరగనుంది. అలాగే పంటల బీమా పథకం అమలుకు ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకంలో చేరుతామని మంత్రి తెలిపిన నేపథ్యాన జిల్లాలో సుమారు 3.45 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇక రైతు కూలీలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఏటా రూ.12వేలు ఇస్తామన్న ప్రకటనపై జిల్లాలోని రైతు కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది. వీటికి తోడు ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 4,88,316 మందికి వర్తించనుంది.

రోడ్లకు మహర్దశ
జిల్లాలోని గ్రామీణ, మండల స్థాయిలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. కొన్ని మారుమూల గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండగా.. 392 కి.మీ. మేర రాష్ట్రీయ రహదారులు దెబ్బతిన్నాయి. అలాగే జీపీలుగా ఏర్పడిన 160కి పైగా తండాల్లో అంతర్గత రోడ్లు లేవు. ప్రస్తుత వర్షాలతో ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. బడ్జెట్‌లో ఆయా శాఖలకు నిధులు ఎక్కువగా కేటాయించడంతో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, మరమ్మతులు జరుగుతాయి. అలాగే, వందకు పైగా జీపీలకు భవన నిర్మాణాలు చేపట్టనుండగా ఊరట లభిస్తుంది.

వెయ్యికి పైగా ప్రీ స్కూళ్లు
చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే కాక విద్య బోధించే అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ అవుతాయి. జిల్లాలోని వెయ్యికి పైగా అంగన్‌వాడీ సెంటర్లను ప్రీ స్కూళ్లుగా మార్చి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యాన నిర్వహిస్తారు. వైద్య రంగానికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించిన నేపథ్యాన... జిల్లాలోని మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తయినందున పనులు మొదలుకానున్నాయి.

'సీతారామ' పై దృష్టి
ఈ ఆర్థిక సంవత్సరం ఆరు, వచ్చే ఏడాది 12 నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు భట్టి బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందులో జిల్లాకు చెందిన పలు ప్రాజెక్టులూ ఉన్నాయి. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల భట్టితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈక్రమంలో బడ్జెట్‌లో పేర్కొన్నట్లుగా ఈ ప్రాజెక్టు సైతం పూర్తవుతుందనే భావన వ్యక్తమవుతోంది. అలాగే, లంకాసాగర్, వైరా, భక్తరామదాసు ప్రాజెక్టులకు సైతం నిధులు కేటాయించారు.

ఎర్రుపాలెం లిఫ్ట్‌కు పెద్దపీట




డ్యామ్ నిర్మించే ఎర్రుపాలెం మండలంలోని కట్లేరు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 3వ జోన్‌లో ఎర్రుపాలెం మండలం పూర్తిగా, మధిర మండలంలో కొన్ని గ్రామాలు ఉన్నాయి. సాగర్ టెయిల్ ఎండ్ కావడంతో వానాకాలం సీజన్‌లోనూ సాగునీరు అందడం లేదు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలతో నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేసి ఆయకట్టును రెండో జోన్‌లోకి తీసుకొచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం ఎర్రుపాలెం మండలంలోని మామునూరు, రాజులదేవరపాడు మధ్య కట్లేరుపై డ్యామ్ నిర్మించి లిఫ్ట్ ద్వారా సాగర్ కాల్వలో నీటిని ఎత్తిపోస్తారు. తద్వారా మూడో జోన్‌లోని ఆయకట్టు రెండో జోన్‌లోకి మారుతుంది. ఈమేరకు డ్యామ్, కాల్వల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లను అంచనా వ్యయంగా పొందుపరిచారు.

పర్యాటకంలో ప్రత్యేకస్థానం

పర్యాటకరంగంలోనూ జిల్లాకు ప్రత్యేక స్థానం దక్కింది. ఎకో–టూరిజం (పర్యావరణ పర్యాటకం)ను పెంపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా పెనుబల్లి, కల్లూరు, ఏన్కూరు, తల్లాడ, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల మధ్య విస్తరించిన కనకగిరి గుట్టలు, ఇక్కడి ఆలయాలు, ప్రాజెక్టులు అభివృద్ధికి నోచుకుంటాయి. అనువైన ప్రాంతాల్లో కాటేజీలు నిర్మించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించనున్నారు. అలాగే, కొత్తగూడెంలోని కిన్నెరసాని ప్రాజెక్టును కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.



పర్యాటక కేంద్రంగా మారనున్న కనకగిరి గుట్టలు

ప్రాధాన్యత రంగాలకు భారీగా నిధులు

దేశచరిత్రలోనే తొలిసారి వ్యవసాయ రంగానికి రూ.72వేల కోట్లు కేటాయించాం. నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకూ ప్రాధాన్యత ఇచ్చాం. ఉమ్మడి జిల్లాలో సీతారామ, సీతమ్మసాగర్, ఎర్రుపాలెం లిఫ్ట్ ఇరిగేషన్‌తోపాటు చిన్నతరహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించాం. ఉమ్మడి ఖమ్మంను సస్యశ్యామలం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం.
– మల్లు భట్టివిక్రమార్క, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి

సంక్షేమానికి పెద్దపీట



సంక్షేమంతోపాటు వ్యవసాయ, నీటిపారుదల, విద్యా రంగాలకు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేశాం. ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించాం. ఈ నిధులతో పనులు పరుగెత్తిస్తాం. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ప్రాధాన్యత రంగాలకు ఇలా నిధులు కేటాయించలేదు.
– తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ మంత్రి

వేగిరంగా పెండింగ్ పనులు



గత ప్రభుత్వం ప్రాధాన్యత రంగాలను నిర్లక్ష్యం చేయడంతో పనులు ముందుకు సాగలేదు. మేం కేటాయించిన నిధులతో సీతారామ సహా ఇతర ప్రాజెక్టుల పనులు చకచకా సాగుతాయి. పాలేరు వరకు సీతారామ పనులు చెప్పినట్లుగా పూర్తవుతాయి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు నిధులు రావడంతో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తవుతుంది.
– పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి

ఎకో టూరిజం హర్షణీయం..



సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో విస్తరించిన కనకగిరి గుట్టలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడం హర్షణీయం. దీంతో పర్యాటకంగా అభివృద్ధి చెంది స్థానికులకు ఉపాధి లభిస్తుంది. విద్య, వైద్య రంగాలకు, వ్యవసాయ రంగాలకే కాక ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికీ ఎక్కువ నిధులు కేటాయించారు.
– మట్టా రాగమయి, సత్తుపల్లి ఎమ్మెల్యే

జనరంజక బడ్జెట్



పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టింది. పేద, మధ్యతరగతి, కార్మిక, కర్షక, రైతు పక్షంగా కూర్పు ఉంది. విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాలకు న్యాయం చేసేలా బడ్జెట్ ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అంకెల గారడీతో కాలం గడిపితే మా ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు చేసేలా కేటాయింపులు చేసింది.
– మాలోతు రాందాస్‌నాయక్, వైరా ఎమ్మెల్యే

ఆరోగ్యమూ ముఖ్యమే..

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- అన్ని శాఖల ఉద్యోగులకు వైద్య పరీక్షలు



కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు పరీక్ష చేస్తున్న వైద్యులు, పక్కన డీఎంహెచ్ఓ మాలతి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూనే ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లాలోని ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన కోసం గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. తొలుత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి పరీక్షలు నిర్వహించి వివరాలతో పాటు పాటించాలిన్సన జాగ్రత్తలను ఫోన్‌కు వాట్సప్ ద్వారా పంపిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో 400మందికి ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీఆర్‌ఓ సన్యాసయ్య, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మానక్ పోస్టర్ల ఆవిష్కరణ
పాఠశాల విద్యార్థుల్లో వైజ్ఞానిక, సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచేలా కేంద్రప్రభుత్వం ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు అందిస్తోందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని గురువారం ఆయన కార్యక్రమ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రాజెక్టుల నమోదు, ఇతర అంశాల్లో సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి(94403 54528)ని సంప్రదించాలని సూచించారు. డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, ఇన్‌స్పైర్ మానక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్ ఆవరణలో పలుచోట్ల పల్లె వాతావరణం ప్రతిబింబించేలా వేయిస్తున్న చిత్రాలను కలెక్టర్ పరిశీలించి చిత్రకారులకు సూచనలు చేశారు.

మళ్లీ పెరిగి'నది'

- దోబూచులాడుతున్న గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీ ముంపు ప్రజలను గోదావరి ముప్పుతిప్పలు పెడుతోంది. వారం రోజులుగా పెరుగుతూ, తగ్గుతూ అయోమయానికి గురి చేస్తోంది. ఓవైపు స్వల్పంగా తగ్గుతూ ఊరటనిస్తూనే మళ్లీ కొద్ది గంటల వ్యవధిలోనే పెరుగుతోంది. బుధవారం రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించగా, ఆ రాత్రే గోదావరి ప్రవాహం మళ్లీ పెరగడం ప్రారంభమైంది. తొలుత స్వల్పంగా, ఆ తర్వాత వేగంగా పెరిగి గురువారం ఉదయం 46.50 అడుగులకు చేరింది. ఆతర్వాత కూడా పెరుగుతూ మధ్యాహ్నం 1.10 గంటలకు 48 అడుగులకు చేరడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై ప్రవాహం మరింత పెరుగుతూ రాత్రి 11గంటలకు 48.10 అడుగులుగా నమోదైంది. గోదావరికి ఎగువన పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నదులు, ఉపనదులు ఉప్పొంగడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం పెరిగింది. గత శనివారం మొదటి, ఆదివారం రెండో ప్రమాద హెచ్చరికల స్థాయికి నీటిమట్టం పెరగగా, ఆ తర్వాత క్రమంగా తగ్గడంతో బుధవారం రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అయితే, ఎగువ నుంచి మళ్లీ వరద రావడంతో క్రమంగా గోదావరి నీటి మట్టం పెరిగింది. దీంతో గురువారం తిరిగి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

పెద్దాస్పత్రికి మరో 50 పడకలు

- ప్రత్యేక క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు
- రూ.23 కోట్లతో త్వరలోనే భవన నిర్మాణం



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పడకల సామర్థ్యం మరింత పెరగనుంది. త్వరలో మరో 50 పడకలతో కూడిన భవన నిర్మాణం చేపట్టనున్నారు. వచ్చే ఏడాదికల్లా ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ టెండర్ ప్రక్రియకు అనుమతి జారీ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ పేరిట మూడంతస్తుల్లో భవనం నిర్మిస్తారు. అత్యవసర సేవలు అందించేలా నిర్మించే ఇందులో క్యాజువాలిటీ, ఐసీయూ, ఏఎంసీ, సర్జికల్ ఐసీయూ, ఓపీ గదులు, సీఎంఓ గదులు ఉంటాయి. ఇందుకోసం కార్డియాలజీ విభాగం ఎదురుగా ఉన్న 50వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఈ స్థలంలో రిటైర్డ్ ఆర్మీ ఈసీహెచ్ఎస్ ఆస్పత్రి ఉండడంతో ఖాళీ చేయాలని నిర్వాహకులకు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. వచ్చే నెల మొదటి వారంలో పాతభవనాలను కూల్చివేసి టెండర్లు ఖరారు కాగానే కొత్త భవనం నిర్మాణం మొదలుపెడతారు. కాగా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని 1962లో ప్రారంభించగా క్రమక్రమంగా అప్‌గ్రేడ్ అవుతోంది. గత ఏడాది మెడికల్ కాలేజీ ఏర్పడడంతో ఆస్పత్రి స్థాయి మరింత పెరిగింది. ప్రస్తుతం 575 పడకలతో ఉన్న ఆస్పత్రిలో మరో 50 పడకలు పెరుగుతుండడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది.

రుణమాఫీ రైతులకు మళ్లీ రుణాలు

- ప్రక్రియలో వేగం పెంచండి
- పీఏసీఎస్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వీ.వీ.పాలెం సొసైటీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన డీఏఓ విజయనిర్మల

రఘునాథపాలెం: ప్రభుత్వం ఇటీవల అమలుచేసిన రుణమాఫీలో అర్హత పొందిన రైతులకు తిరిగి రుణాలు ఇచ్చే ప్రక్రియ వేగంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. తద్వారా పంటల సీజన్‌లో రైతులకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని పీఏసీఎస్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రుణాల మాఫీ, రెన్యూవల్ ప్రక్రియపై ఆరా తీశాక కలెక్టర్ మాట్లాడారు. సంఘం ఖాతాలో జమ అయిన నగదును రైతుల ఖాతాల్లోకి చేర్చాలని.. ఆపై అవసరమైన వారికి అర్హత మేరకు కొత్తగా రుణాలు ఇవ్వాలని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా రుణమాఫీ కాకపోతే అందుకు కారణాలను స్పష్టంగా వివరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఏఓ విజయనిర్మల, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కరరావు, సొసైటీ సీఈఓ ఐతగాని తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రుణాలు ఇవ్వండి
కొణిజర్ల/నేలకొండపల్లి: ప్రభుత్వం రుణమాఫీ ప్రారంభించిన నేపథ్యాన రూ.లక్ష లోపు రుణాలు మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామీణ వికాస బ్యాంకు, యూనియన్ బ్యాంకులను సందర్శించిన ఆమె రుణమాఫీ వివరాలు ఆరా తీసి కొత్త రుణాల మంజూరుపై సూచనలు చేశారు. కాగా, 2023 డిసెంబర్ 9 నాటికి కటాఫ్ పెడితే బ్యాంకు సిబ్బంది ఆ తర్వాత ఆరు నెలలకు వడ్డీ చెల్లించాలంటున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. ఆతర్వాత నేలకొండపల్లి మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, ఆరెగూడెంల్లో పర్యటించిన డీఏఓ రుణమాఫీ పొందిన రైతులతో మాట్లాడారు. ఏఓలు అరుణకుమారి, బాలాజీ, ఏఈఓలు దుర్గాభవాని, రామకృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

17 అడుగులకు చేరిన పాలేరు



కళకళలాడుతున్న పాలేరు రిజర్వాయర్ (ఇన్‌సెట్) 17 అడుగులకు చేరిన నీటిమట్టం

సాగర్ నుండి నిలిచిన నీటి సరఫరా

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గురువారానికి 17 అడుగులకు చేరింది. ఈనెల 20వ తేదీన సాగర్ నుండి నీటిని విడుదల చేయగా రిజర్వాయర్ నీటిమట్టం 5.5 అడుగుల నుండి 17 అడుగులకు పెరిగింది. కాగా, గురువారం ఉదయం సాగర్ నుండి నీటి సరఫరాను అధికారులు నిలిపేశారు. అయినా కాల్వలో ఉన్న 2,100 క్యూసెక్కుల మేర నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. ఈ నీరంతా పూర్తయ్యే సమయానికి నీటిమట్టం 18అడుగులు దాటొచ్చని అధికారులు భావిస్తున్నారు. కాగా, 23 అడుగుల సామర్థ్యం కలిగిన పాలేరు కొద్దిరోజుల క్రితం డెడ్‌స్టోరేజీకి చేరగా.. ఇప్పుడు మళ్లీ 17 అడుగుల మేర నీటితో కళకళలాడుతోంది. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకపోగా ఎగువ కురుస్తున్న వర్షాలతో సాగర్ నిండితే మళ్లీ సాగు అవసరాలకు విడుదల చేసే అవకాశముందని చెబుతున్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మకు సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి ఆలయం వద్ద సారెతో సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన శ్రీ బాలాజీ సేవాసమితి ఆధ్వర్యాన విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు గురువారం సారె సమర్పించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ పండ్లు, పూలను అమ్మవారికి సమర్పించడమే కాక 250 మంది ముత్తయిదువులకు వాయినం ఇచ్చారు. శ్రీ బాలాజీ సేవా సమితి అధ్యక్షురాలు వద్దే లక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రశేఖర్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, వెంకటాచారి, రత్న, మణి పాల్గొన్నారు.

26 నుంచి పాలిసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 26వ తేదీ నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్(స్పెషల్ ఫేజ్) నిర్వహించనున్నట్లు ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల కౌన్సెలింగ్ కేంద్రం కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26న స్లాట్ బుక్ చేసుకుని 27న జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు. ఆతర్వాత 27, 28వ తేదీల్లో ఆప్షన్ల ఎంపిక, 31వ తేదీ వరకు సీట్ల కేటాయింపు జరిగాక కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఇదిలా ఉండగా స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 8నుంచి జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ అధికారులతో సీఎండీ సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వివిధ అంశాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బకాయిల వసూళ్లు, అంతరాయాలు, గృహజ్యోతి పథకం నిర్వహణ, వ్యవసాయ కనెక్షన్లపై ఆరా తీసిన ఆయన ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీసీకి జిల్లా నుంచి ఎస్ఈ ఎ.సురేందర్ తదితరులు హాజరయ్యారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



ఉద్యోగులు, ప్రైవేట్ సిబ్బందితో డీఎఫ్ఓ

కారేపల్లి: జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతం, వన్యప్రాణులసంరక్షణకు అటవీ శాఖ ఉద్యోగులు కృషి చేయాలని డీఎఫ్ఓ సిద్ధార్థవిక్రమ్‌సింగ్ సూచించారు. కారేపల్లిలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆతర్వాత ప్రైవేట్ సిబ్బందికి యూనిఫాం అందజేశారు. ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్ఆర్ఓ హరిప్రసాద్, డీఆర్ఓ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిని బెదిరించిన ఆరుగురిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా గ్రామపంచాయతీ కార్యదర్శి పి.సువర్ణఉమను దుర్భాషలాడిన ఆరుగురిపై కేసు నమోదైంది. గ్రామానికి చెందిన భూక్యా రవి, రుక్మిణి, వాల్యా, పద్మ, మోహన్, వీరన్నలు తమకు సంబంధించిన పనులు చేయడం లేదని.. ఇకనైనా చేయకపోతే అంతు చూస్తామని కార్యదర్శిని బెదిరించారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి బెదిరించారని ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రామారావు తెలిపారు.

షాపు యజమానిపై కేసు నమోదు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో మెకానికల్ షాప్‌లో బాలుడిచే పనులు చేయిస్తున్న యజమాని ధర్మపురి బాలకృష్ణపై గురువారం కేసు నమోదైంది. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా కార్మిక శాఖ చల్లా వెంగమాంబ ఆధ్వర్యాన రెడ్డిపల్లిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మెకానిక్ షాపులో బాలుడితో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,425	2,425
పెసలు	7,601	4,400
మిర్చి	17,700	7,000
ఏసీ మిర్చి	19,400	10,000
ఏసీ తాలు	9,000	9,000
పత్తి	7,250	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,705

పారిశుద్ధ్యం కోసం ప్రత్యేకడ్రైవ్

- ఏబీసీలో కుక్కలకు శస్త్రచికిత్స
- రోడ్లు, డ్రైయినేజీల సమస్యల పరిష్కారంపై దృష్టి
- ఖాళీ స్థలాల యజమానులు శుభ్రం చేయించకపోతే జరిమానా
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని, రోజుకు తొమ్మిది డివిజన్లలో ఈ కార్యక్రమం జరుగుతోందని కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలిచినా, పిచ్చిమొక్కలు ఉన్నా యజమానులే శుభ్రం చేయించుకోవాలని, అలా చేయకపోతే కేఎంసీ ద్వారా పనులు చేయించి జరిమానా విధిస్తామని చెప్పారు. కుక్కల సమస్యపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యాన వారం క్రితమే యానిమల్ బర్త్ కంట్రోల్‌సెంటర్(ఏబీసీ)లో శస్త్రచికిత్సను ప్రారంభించామని తెలిపారు. కేఎంసీ పరిధిలోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన గురువారం ఫోన్ ఇన్ నిర్వహించగా కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి సమస్యలు తెలుసుకోవడంతో సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి.

ప్రశ్న : రోడ్లన్నీ గుంతలమయమై నడవలేని పరిస్థితి నెలకొంది.

– రిటైర్డ్ ఉద్యోగి, టీచర్స్ కాలనీ, శ్రీనివాసనగర్

కమిషనర్ : ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలన చేయించి రోడ్లు మరమ్మతు చేయించడమా, కొత్తగా వేయించడమా అన్నది నిర్ణయిస్తాం. రూ.4లక్షల నుంచి రూ.5లక్షల లోపు ఖర్చుతో పూర్తయితే నేరుగా నిర్మాణానికే అనుమతిస్తాం.

ప్రశ్న : వర్షం పడితే చాలు రోడ్లపై నీళ్లు నిలుస్తున్నాయి. డ్రైయినేజీల్లో మురుగు సాగడం లేదు.

– 22వ డివిజన్, ముస్తఫానగర్ వాసి

కమిషనర్ : ప్రస్తుతానికి రోడ్లపై నిలిచిన నీటి తొలగింపునకు డీఆర్ఎఫ్ టీమ్‌ను పంపిస్తాం. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అధికారులతో పరిశీలన చేయిస్తాం.

ప్రశ్న : కల్వర్టును నిర్మించకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది.– 51వ డివిజన్ వాసి

కమిషనర్ : మీ ఇంటి నంబర్ వాట్సాప్ చేయండి. అక్కడకు మా ఉద్యోగులు వచ్చి కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు.

ప్రశ్న : ఇళ్ల మధ్య ఉన్న సెల్‌టవర్‌తో సమస్యగా ఉంది.

– సత్యసాయినగర్ రోడ్, శ్రీనివాసనగర్ వాసులు

కమిషనర్ : ఇళ్ల మధ్య సెల్‌టవర్లకు అనుమతి ఇవ్వొద్దు. ప్రస్తుతం ఈ టవర్‌ను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : బీసీ హాస్టళ్ల వద్ద రహదారులపై వ్యర్థాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న మద్యం షాపుల వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.

– షేక్ షకీనా, ముస్తఫానగర్

కమిషనర్ : వ్యర్థాల తొలగింపునకు శానిటేషన్ సిబ్బందిని ఆదేశిస్తాం. ఇకపై చెత్త రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ అధికారులతో కలిసి వైన్స్ వద్ద ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : రోడ్లు సరిగా లేక ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలిచి పిచ్చిమొక్కలు పెరిగి పాములు, దోమలకు ఆవాసంగా మారాయి.

– 14వ డివిజన్, మధురానగర్ వాసి

కమిషనర్ : రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నాం. ఖాళీ స్థలాల్లో నీరు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు డీఆర్ఎఫ్ టీమ్‌ను పంపిస్తాం.

ప్రశ్న : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు రూ.1000 చెల్లించా. మిగిలిన నగదు కూడా కట్టేందుకు అవకాశం ఇవ్వండి – నగర వాసి

కమిషనర్ : మీ దరఖాస్తు నంబర్‌ను వాట్సాప్ చేయండి. పరిశీలించి సమాచారం అందజేస్తాం.

ప్రశ్న : డ్రైయినేజీలుపైకి, రోడ్లు కిందకు నిర్మించడంతో వర్షం కురిస్తే నీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది.

– 18వ డివిజన్, సీతారామనగర్ వాసి

కమిషనర్ : ఇంజనీరింగ్ అధికారులను పంపించి పరిశీలన చేయిస్తాం. ఆ రోడ్డును సరిదిద్దడం ఎలా అన్నది నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న : కుక్కలు, పందుల బెడదతో పిల్లలు బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. వీటి అరుపులతో రాత్రి నిద్ర కూడా పట్టడం లేదు

– వినయ్, జూబ్లీపుర, శ్రీనివాసరావు, ఖానాపురం

కమిషనర్ : కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) యూనిట్‌లో శస్త్రచికిత్సలు ప్రారంభించాం. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముందుగా బంధించి ఆపరేషన్ చేయిస్తాం. సమస్య త్వరలోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : మా ఇంటి వద్ద ఖాళీ స్థలాలను సమీప హోటళ్లకు వచ్చిన వారు మూత్రశాలలుగా ఉపయోగిస్తున్నారు. ఎంత చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– లకారం ట్యాంక్ బండ్ వాసి

కమిషనర్ : ఖాళీ స్థలాల యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. ఆ ప్రాంతంలో పరిశీలించి మరోసారి నోటీసులు జారీ చేస్తాం. రెండు రోజుల్లో స్థలాలను శుభ్రం చేయించుకోకపోతే మేం చేయించి యజమానులకు జరిమానా విధిస్తాం.

ప్రశ్న : జీఓ 59 కింద పట్టాలు స్థలాల్లో ఇంటి నంబర్లు కేటాయించలేదు.

– ఏ.అశోక్, నగరవాసి

కమిషనర్ : ఇప్పటికే ఇంటినంబర్ల కేటాయింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. ఇంకా నంబర్ రాని వారు టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి కేటాయిస్తాం.

ప్రశ్న : శివారు ప్రాంతంలో పందుల బెడద ఎక్కువగా ఉంది.

– వెంకటరమణ, శ్రీనివాసనగర్

కమిషనర్ : పందులను పట్టించే చర్యలు తీసుకుంటాం. శివారు ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తాం.

ప్రశ్న : డ్రెయినేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – గిరీశం, 34వ డివిజన్, శ్రీనివాసరావు, ఖానాపురం హవేలి

కమిషనర్ : మీ ప్రాంతానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇవ్వండి. ఇంజనీరింగ్ అధికారులను పంపించి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : ఇంటి నిర్మాణ అనుమతి రానందున చెల్లించిన డబ్బు తిరిగి ఇప్పించండి

– సింగిరెడ్డి మనోహర్‌రెడ్డి

కమిషనర్ : టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్నాక నిర్మాణ అనుమతి రాకపోతే వారు కోరితే డబ్బు తిరిగి చెల్లిస్తాం. మీ దరఖాస్తు నంబర్, ఫోన్ నంబర్ ఇస్తే త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న : వీధిదీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం

– బిక్షపతి, రాపర్తినగర్

కమిషనర్ : నగరంలో వీధిదీపాలు లేని చోట్ల పెట్టించేందుకు చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరిస్తాం. అధికారులను పంపి పరిశీలన చేయిస్తాం.

ప్రశ్న : అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న వారు దాని ముందు డ్రెయిన్ ఏర్పాటు చేయలేదు. దీంతో కార్మికులు వాడే నీరు, ఇతర మురుగు మా ఇంటి ముందుకు చేరి దుర్వాసన వెదజల్లుతోంది.వచ్చి నిలుస్తోంది. ఇది తీవ్ర ఇబ్బందిగా ఉంది

– నితిన్, శ్రీనివాసనగర్

కమిషనర్ : తక్షణమే టౌన్‌ప్లానింగ్ అధికారులను అక్కడికి పంపి సమస్య పరిష్కరిస్తాం.

సాక్షి ఫోన్ ఇన్

సత్వరమే సమస్యల పరిష్కారం

ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్ ఇన్ ద్వారా సమస్యలు తెలుసుకున్న ఆయన నోటీసులు తయారు చేయించారు. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల వారీగా ఫిర్యాదులపై నోటీసులు తయారు చేసి అధికారులకు అందించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇక శ్రీనివాసనగర్‌లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ నుండి వస్తున్న మురుగునీటి సమస్యలను పరిశీలంచాలన్న సూచనలతో టౌన్ ప్లానింగ్ అధికారులు వెళ్లి ఆరా తీశారు.

బాగుంది.. అలా ఏమీ లేదు...

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- డిప్యూటీ సీఎం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని దివాళా తీయించినా తమ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో అన్నివర్గాలు, రంగాలకు సమన్యాయం జరిగేలా బడ్జెట్ ప్రవేశపెట్టిందని వెల్లడించారు.
- రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు పక్షపాతంగా ఉందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి తెలిపారు. వ్యవసాయ రంగానికి ఏకంగా రూ.72,659కోట్లు కేటాయించడం చరిత్రలో ఇదే తొలిసారని పేర్కొన్నారు.
- బడ్జెట్ మహిళా ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చేదిగా ఉందని కాంగ్రెస్ మహిళా విభాగం మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అన్నారు. మహిళా క్యాంటీన్లు, మహాలక్ష్మి పథకానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారని తెలిపారు.
- జనరంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారంటూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని గురువారం భట్టిని ఆయన డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో పాటు కలిశారు.
- రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించకపోవడం గర్హనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. ఈమేరకు ఖమ్మం జెడ్పీసెంటర్‌లో గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. నాయకులు మార్తి వీరభద్రప్రసాద్, వెంకటనారాయణయాదవ్, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, సరస్వతి, చంద్రశేఖర్, కిరణ్, అల్లిక అంజయ్య, కోటేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.
- బడ్జెట్‌లో సంక్షేమానికి రూ.40వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72,669 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగినదే అయినా మారిన పరిస్థితుల్లో మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉంటే బాగుండని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు, విద్యా రంగం, ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు కేటాయింపులు పెంచాలని కోరారు.

ఇరిగేషన్, విద్య, వైద్య రంగాలకు తగ్గిన కేటాయింపులు..

- నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు గతంతో పోలిస్తే కేటాయింపులు తగ్గించారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించారని తెలిపారు. తద్వారా 2030 నాటికి కూడా ప్రాజెక్టు పూర్తయ్యేలా లేవని పేర్కొన్నారు.
- ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ రానున్న కాలంలో ప్రజలపై అంతులేని పన్నుల భారాన్ని మోపేదిగా ఉందని మాస్‌లైన్ నాయకుడు ఆవుల అశోక్ అన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు హామీలు ఇవ్వకపోగా, పేదలకు ఒరిగేదేమి లేదని తెలిపారు.
- ప్రభుత్వం బడ్జెట్‌పై క్రీడారంగానికి రూ.325 కోట్లు కేటాయించడంపై ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టా శంకర్, కె.క్రిస్టోఫర్‌బాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇన్ని నిధులు కేటాయించలేదని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

'కేఎండీసీ'కి అటానమస్ హోదా



వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కరస్పాండెంట్ అప్పిరెడ్డి, తదితరులు

ఖమ్మం సహకారనగర్: గడిచిన 33ఏళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న తమ కాలేజీకి యూజీసీ అటానమస్(స్వయం ప్రతిపత్తి) హోదా ప్రకటించిందని ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(కేఎండీసీ) చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోనే అటానమస్ హోదా సాధించిన ఏకైక ప్రైవేట్ డిగ్రీ కళాశాల తమదని చెప్పారు. 1991లో కళాశాలను ఏర్పాటు చేసి ఎంసీఏ, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, డేటా సైన్స్ తదితర కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు పలువురు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఐదేళ్ల పాటు అటానమస్ హోదా అమల్లో ఉంటుందని, పరీక్షల స్వీయ నిర్వహణ, మూల్యాంకనం తదితర వెసులబాట్లు లభిస్తాయని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి టపాసులు కాల్చి సంబురాలు చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్, అడ్వైజర్ పన్నాల కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లంకాసాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల



లంకాసాగర్ నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

పెనుబల్లి: పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు గురువారం సాగునీరు విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రామారావు, జేఈ కిరణ్ నీటిని విడుదల చేయగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా పెనుబల్లి, వేంసూరు మండలాల పరిధిలో 10 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఈమేరకు రైతులతో కలిసి రెండు తూముల వద్ద పూజలు చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం లంకాసాగర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్, సిబ్బందికి సూచించారు. ఆతర్వాత వీఎం బంజర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన ఆయన పెనుబల్లి మండలం రామచంద్రాపురం, రామచందర్‌రావు బంజర్, కేఎం.బంజర్‌లో పలువురి కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు సోమరాజు సీతారామారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, గూడూరు మాధవరెడ్డి, చీకటి చిన్ననర్సింహారావు, రాజబోయిన కోటేశ్వరరావు, తేళ్ల ఆనందరావు, అలుగోజు చిన్నస్వామి, పిల్లి నవజీవన్, విశ్వనాథ్, దొంతు మాధవరావు, పోతురాజు కిషోర్, ఎస్.కే.కరీముల్లా పాల్గొన్నారు.

శ్రీకోటమైసమ్మ తల్లి జాతరలో వేలం



వాగ్వాదానికి దిగిన నాయకులు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మతల్లి జాతరలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి, ప్రసాదాల అమ్మకానికి అనుమతి ఇచ్చేందుకు గురువారం వేలం నిర్వహించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే జాతర సందర్భంగా అమ్మకాలకు వేలం నిర్వహించగా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ వేణుగోపాలాచార్యులు పర్యవేక్షించారు. మిఠాయి అమ్మేందుకు గత ఏడాది రూ.1.17లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.1.42లక్షలు వేలం పలికింది. ఐస్‌క్రీమ్ అమ్మకానికి గత రూ.29వేలు, ఈ ఏడాది రూ.30వేలకు దక్కించుకున్నారు. పుట్నాలు, పేలాలు అమ్మేందుకు గత ఏడాది రూ.40వేల ఆదాయం నమోదు కాగా, ఈసారి రూ.41వేలకు వేలంలో వ్యాపారులు దక్కించుకున్నారు. ఇతర అంశాలపై వ్యాపారులు ధరావతు చెల్లించకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగులు పర్సా సాయి, గణితి నారాయణ, మూడ్ మోహన్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వేలం సందర్భంగా అధికారులు నిబంధనలు పాటించడం లేదని మాజీ సర్పంచ్ బానోత్‌బన్సీలాల్ వాగ్వాదానికి దిగారు. దీంతో బీఆర్ఎస్ నాయకుడు జాల సాంబ కలుగజేసుకోగా వివాదం చోటు చేసుకుంది. అనంతరం దేవస్థానం జాతర ప్రాంగణానికి హద్దులు నిర్ణయించి భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రూ.20 వేల విలువైన గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

వైరా: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం డిపోకు చెందిన బస్సు ఖమ్మం వెళ్తుండగా వైరా బస్టాండ్‌లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాలుగు ప్యాకెట్లలో రూ.20వేల విలువైన గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితులు మాత్రం పట్టుబడలేదు. తనిఖీల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సీతారాం, రవికుమార్, రాము, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి మొక్క, గంజాయి..



గంజాయి మొక్క, గంజాయిని పరిశీలిస్తున్న ఎస్సై, తదితరులు

చింతకాని: మండలంలోని నాగులవంచలో ఒకరి ఇంట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఎస్సై నాగుల్‌మీరా ఆధ్వర్యాన పరిశీలించగా ఇంటి పెరట్లో ఏపుగా పెరుగుతున్న గంజాయి మొక్కను గుర్తించారు. అనంతరం ఇంట్లో సోదా చేయగా అట్టపెట్టెలో దాచిన గంజాయి లభ్యమైంది. డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రనాయక్ ఆధ్వర్యాన పంచనామా నిర్వహించగా.. వైరా సీఐ సాగర్ పరిశీలించారు. ఈమేరకు పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

ఉద్యోగుల జాబితా కోరిన వ్యవసాయ శాఖ

ఖమ్మంవ్యవసాయం: ఉద్యోగుల బదిలీల్లో ప్రత్యేక హక్కు కలిగిన వారి వివరాలను పంపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ గురువారం జిల్లా అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం బదిలీల ప్రక్రియకు తొలుత ఈనెల 20వరకు అవకాశం కల్పించగా, ఆతర్వాత 31 వరకు పొడిగించింది. అయితే, రుణమాఫీ, పంటల బీమా పథకాల అమలుతో వ్యవసాయ, సహకార శాఖల్లో మాత్రం బదిలీలు నిలిపేశారు. ఈనేపథ్యాన ఏడాదిలోగా రిటైర్ అయ్యే వారే కాక స్పౌజ్ కేసులు, దివ్యాంగులు తదితర హక్కులు కలిగినవారి వివరాలు పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో లెక్కలు తీస్తున్నారు. జిల్లాలో ఇలాంటి అధికారులు 50 మంది వరకు ఉంటారని అంచనా.

ట్రాన్స్‌కో సీఎండీకి వినతి...

విద్యుత్ శాఖలో బదిలీలపై ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్‌ను వివిధ యూనియన్ల ప్రతినిధులు కలిశారు. ప్రభుత్వ శాఖల్లో బదిలీలు జరుగుతున్నందున తమ విషయంలోనూ స్పష్టత ఇవ్వడమే కాక పదోన్నతుల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పినట్లు సమాచారం.

ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ అరెస్ట్

- రూ.10లక్షల విలువైన 45 బైక్‌లు స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

ఖమ్మంఅర్బన్: ఒక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ వాయిదాలు చెల్లించని వారి నుంచి బైక్‌లు తీసుకొచ్చి కంపెనీకి అప్పగించకుండా అమ్ముకుంటున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు గురువారం ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా వివరాలను నగర ఏసీపీ రమణమూర్తి వెల్లడించారు. ఖమ్మంలోని చర్చి కాంపౌండ్‌కు చెందిన గుండా సాయిసందీప్ రికవరీ ఏజెంటుగా శ్రీనగర్‌కాలనీలోని జయంతి అసోసియేట్స్ బజాజ్ ఫైనాన్స్‌లో 2022 నుంచి పని చేస్తున్నాడు. ఈ సంస్థ నుంచి వాహన రుణాలు తీసుకున్న వారు వాయిదాలు చెల్లించకపోతే కంపెనీ బాధ్యులు చెప్పారంటూ 45 బైక్‌లను సందీప్ స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం వీటిని సంస్థకు అప్పగించకుండా అన్ని సర్టిఫికెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి ఇతరులకు అమ్ముకున్నాడు. ఆపై వచ్చిన డబ్బులతో జల్సా చేస్తున్న ఆయనపై అనుమానంతో సంస్థ నుంచి తొలగించారు. ఆతర్వాత విచారించగా మరో ఇద్దరితో కలిసి సాయిసందీప్ 45బైక్‌లను అమ్ముకున్నట్లు తేలింది. దీంతో సంస్థ బాధ్యులు ఫిర్యాదు చేయడంతో అరెస్ట్ చేసి రూ.10 లక్షల విలువైన బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, ఎస్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: ఇటీవల రాత్రి వేళ రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యాన సీపీ సునీల్‌దత్ ఆదేశాలతో నగరంలో పోలీసులు విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. ఈమేరకు అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు పర్యవేక్షణలో బుధవారం రాత్రి కమిషనరేట్ వ్యాప్తంగా వాహనాల డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారుల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 55 మందిపై కేసు నమోదు చేసినట్లు అడిషనల్ డీసీపీ తెలిపారు. ఇన్నాళ్లు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే జరిమానా విధించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చేవారమని, ఇకపై వాహనాలు సీజ్ చేసి మైనర్లు, వారి తల్లిదండ్రులను కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ ధోని–ది అన్‌టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

ఫ్యాషన్








గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి నిఖితా కౌశిక్. ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.


నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావుణ్ణనిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.

పోహా పకోడీ



కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత. **తయారీ:** ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలోఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహా పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.

కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.
తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్నవన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు


● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్ర శ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యాజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను


● ప్రణీత

'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.

హారర్... థ్రిల్


● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.


● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

తెగబడవేమీ...

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగనీ నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!


● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబా' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు


● మహేంద్రనాథ్

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజి' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజి'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.

ఏమైందో మనసే...


● పవన్, సాహిబా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్ట్ 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్ఝల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.